Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANIVARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue) : 356 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 13 - 6 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

# కూలిన విమానంలో గుజరాత్ మాజీ సీఎం.. ఆయన చివరి ఫొటో ఇదే..



**అహ్మదాబాద్ :** అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్‌పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా విమానం కొన్ని సెకన్లలోనే కూలిపోయిన సంగతి తెలిసిందే. మొత్తం 242 మంది ప్రయాణికులతో వెళ్తున్న విమానం ఒక్కసారిగా కూలిపోయి మంటల్లో చిక్కుకుంది. భారీ ప్రాణనష్టం సంభవించింది. ఈ విమానంలోనే గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపాని కూడా ఉన్నారు. లండన్‌లో చదువుకుంటున్న తన కూతురిని చూసేందుకు విజయ్ రూపాని ఎయిరిండియా విమానంలో పయనమయ్యారు. విమానంలో ఆయన కూర్చున్న ఫొటో ఒకటి బయటకు వచ్చింది. వేరే ప్రయాణికురాలు విమానంలో తన సీటులో కూర్చున్న విజయ్ రూపానిని ఫొటో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. విమానం ఎక్కినట్టు నిర్ధారించే ప్యాసింజర్ జాబితాలో కూడా ఆయన పేరు ఉంది. విమానంలో ప్రయాణిస్తున్న అందరూ చనిపోయినట్టు వార్తలు వస్తున్నాయి. దీంతో విజయ్ రూపాని చివరి ఫొటో ఇదే అంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాగా, విమాన ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు సంఘటనా స్థలానికి బయల్దేరారు. ప్రధాని మోదీ కూడా రామ్మోహన్ నాయుడుతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. మరోవైపు ఎయిరిండియా ఛైర్మన్ చంద్రశేఖరన్ ఈ ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ప్రకటించారు.

# విమాన ప్రమాదం.. విజయోత్సవసభ వాయిదా




**అమరావతి, (రాజధాని వార్తలు):** అహ్మదాబాద్ విమాన ప్రమాదం నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా నిర్వహించ తలపెట్టిన విజయోత్సవ సభను రేపటికి (శుక్రవారం) వాయిదా వేసింది. అహ్మదాబాద్ విమాన ప్రమాదం కారణంగా సభను వాయిదా వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసంలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. మరోవైపు అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. విమాన ప్రమాదంలో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు మృతి చెందడంపై విచారం వ్యక్తం చేశారు. ఘోర దుర్ఘటన నేపథ్యంలో ప్రభుత్వం ఈరోజు (గురువారం) సాయంత్రం తలపెట్టిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని వాయిదా వేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. కాగా.. అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రమాద సమయంలో విమానంలో ప్రయాణికులు, సిబ్బంది కలిసి మొత్తం 242 మంది ఉన్నారు. ఈ ప్రమాదంలో మొత్తం 242 మంది మరణించారు. ప్రస్తుతం ఘటనా స్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇక ఈ విమానంలో ప్రయాణిస్తున్న గుజరాత్ మాజీ సీఎం విజయ్ రుపానీ కూడా మరణించారు. లండన్‌లో ఉన్న కుమార్తె వద్దకు వెళుతుండగా విమాన ప్రమాదంలో విజయ్ రూపానీ ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంపై ప్రధాని మోదీ సహా రాజకీయ ప్రముఖులు విచారం వ్యక్తం చేస్తూ ట్వీట్లు చేశారు.

# రాష్ట్రంలో భారీ వర్షాలు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉందని విశాఖపట్నంలోని వాతావరణ కేంద్రం గురువారం వెల్లడించింది. అలాగే ఉత్తర కోస్తా, దక్షిణ ఒడిశాలో ప్రసుత్తం ఉపరితల ఆవర్తనం విస్తరించిందని తెలిపింది. ఈ ప్రభావం కారణంగా రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే కోస్తా ఆంధ్రాలో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు పడతాయని చెప్పింది. కొన్ని చోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందంది. ఈ సమయంలో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వివరించింది. ఈ నేపథ్యంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని విశాఖపట్నంలోని వాతావరణ శాఖ సూచించింది. మరోవైపు అనుకున్న సమయానికంటే ముందే నైరుతి రుతుపవనాలు తెలుగు రాష్ట్రాల్లోకి ప్రవేశించాయి. దీంతో ఇప్పటికే విస్తారంగా వర్షాలు



కురుస్తున్నాయి. ఇంకోవైపు కొన్ని ప్రాంతాల్లో ఎండలు మండిపోతున్నాయి. అయితే ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉండడంతో.. రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడనున్నాయి.

# పరీక్షలు మొదలయ్యాయి ఆపలేం.. డీఎస్సీపై సుప్రీం




**అమరావతి, (రాజధాని వార్తలు):** ఏపీలో మెగా డీఎస్సీ పరీక్షల నిలిపివేతకు సుప్రీం కోర్టు నిరాకరించింది. మెగా డీఎస్సీ పరీక్షలపై స్టే ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణకు సుప్రీం విముఖత చూపించింది. ఈ కేసులో ఏపీ హైకోర్ట్‌ను ఆశ్రయించాలని పిటిషనర్‌కు ధర్మాసనం సూచించింది. జూన్ 16 నుంచి హైకోర్టు పునః ప్రారంభమైన తరువాత అక్కడే పిటిషన్ దాఖలు చేయాలని సుప్రీం తెలిపింది. మెగా డీఎస్సీ ఇప్పటికే ప్రారంభమైనందున వాటిని నిలిపివేయలేమని జస్టిస్ పీకే మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం తేల్చి చెప్పింది. పరీక్షలు ప్రారంభమైన తరువాత మధ్యలో ఎలా ఆపేస్తామని జస్టిస్ మన్మోహన్ అన్నారు. ఏపీ ప్రభుత్వం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనల్లో.. మెగా డీఎస్సీ పరీక్షకు లక్షలాది మంది ఆశావాహులు ఇప్పటికే హాజరయ్యారని, పరీక్షలు జరుగుతున్నాయని, ఈ దశలో వీటిని నిలిపివేస్తే చాలా మందికి అన్యాయం చేసినట్లు అవుతుందని, వారి ప్రాథమిక హక్కులను హరించినట్లు అవుందని చెప్పారు. ఏపీ హైకోర్టును పిటిషనర్ ఎందుకు ఆశ్రయించలేదని జస్టిస్ పీకే మిశ్రా ప్రశ్నించగా.. ఏపీ హైకోర్టుకు సెలవులు ఉన్నాయని అందుకే అదనపు పత్రాలతో సుప్రీం కోర్టును ఆశ్రయించినట్లు పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. జూన్ 16న ఏపీ హైకోర్టు తిరిగి ప్రారంభమవుతుందని అవసరమైతే అక్కడే పిటిషన్ దాఖలు చేయవచ్చని సుప్రీం స్పష్టం చేసింది. ఏపీలో ప్రభుత్వ పాఠశాలల్లో 16,347 బోధనా పోస్టులను భర్తీ చేసేందుకు మెగా డీఎస్సీని ఏర్పాటు చేశారు. దాదాపు 5.72 లక్షల మంది అభ్యర్థులు నెల రోజు పాటు ఈ పరీక్షలను రాయనున్నారని.. ఈ దశలో పరీక్షలను నిలిపివేయడం సాధ్యంకాదని సుప్రీం కోర్టు చెప్పింది. అయితే ఈ ప్రక్రియ అంతా ఏకపక్షంగా జరుగుతోందని, పారదర్శకంగా లేదని.. అందుకే భారత రాజ్యాంగం కింద ఆర్టికల్ 14, 15 ప్రకారం హక్కులను ఉల్లంఘిస్తుందని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. ఏది ఏమైనా జూన్ 16న ప్రారంభంకానున్న ఏపీ హైకోర్టులోనే పిటిషన్ దాఖలు చేసుకోవాలని.. ఇప్పుడు మెగా డీఎస్సీని నిలిపివేయడం సాధ్యం కాదంటూ స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.

# పరవాడ ఫార్మాసిటీలో ప్రమాదం.. ఇద్దరు కార్మికులు మృతి




**పరవాడ, (రాజధాని వార్తలు):** పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో ప్రమాదం జరిగింది. ఎస్ఎస్ ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఈ ఘటన జరిగింది. గ్యాస్ లీక్ కావడంతో ముగ్గురు కార్మికులు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. అందులో ఇద్దరు కార్మికులు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మృతి చెందినవారు పరిమి చంద్రశేఖర్, సరగడం కుమార్ మృతులుగా గుర్తించారు. బైడూ భైసాల్ అనే కార్మికుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. 1. పరిమి చంద్రశేఖర్ (సేఫ్టీ మేనేజర్ – తెలంగాణ), 2. సరగడం కుమార్ గారు (సేఫ్టీ ఆఫీసర్ – మునగపాక, అనకాపల్లి), 3. బైడూ భైసాల్ అనే హెల్పర్ (బోడెన్, ఒడిశా), అనకాపల్లి జిల్లా, పరవాడ ఫార్మాసిటీలో దుర్ఘటన సంభవించింది. కంపెనీలోని ఎస్ఎస్ (సాయి శ్రేయస్) ఫార్మా కంపెనీలో బుధవారం అర్ధరాత్రి ప్రమాదం జరిగింది. కంపెనీలోని రసాయన వ్యర్థాల ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద స్థాయిలను తనిఖీ చేయడానికి వెళ్లిన ముగ్గురు కార్మికులు అక్కడ విడుదలైన రసాయన విషవాయువులను పీల్చి అస్వస్థతకు గురయ్యారు. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందగా.. మరో కార్మికుడు షీలానగర్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. సమాచారం తెలిసిన వెంటనే పరవాడ సీఐ మల్లికార్జునరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# అందుకే వైసీపీ 11 సీట్లకే పరిమితం అయింది : ఎమ్మెల్యే బోండా ఉమ




**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఏడాది కూటమి పాలనలో ప్రజలకు సంక్షేమంతో పాటు, రాష్ట్ర అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నారని, గత ఐదేళ్లుగా వైసీపీ పాలనలో ప్రజలు విసిగిపోయి... 11 సీట్లకే వారిని పరిమితం చేశారని తెలుగుదేశం ఎమ్మెల్యే బోండా ఉమ అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడారు. కూటమిపై నమ్మకంతో ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ.. సీఎం చంద్రబాబు ప్రణాళిక బద్ధంగా పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. అభివృద్ధి పనులు కూడా ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తున్నారని పేర్కొన్నారు.

**వారి కళ్లల్లో ఆనందం చూస్తున్నాం..**

గత ప్రభుత్వంలో ఉన్న రోడ్లు.. ఈ ఏడాది పాలనలో ఉన్న రోడ్లు చూస్తేనే ప్రజలకు అర్థమవుతుందని బోండా ఉమ అన్నారు. తప్పకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంతో పాటు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. చెప్పిన విధంగా పెన్షన్ పెంచి.. ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటింటికి తీసుకువెళ్లి అందిస్తున్నామని చెప్పారు. అన్న క్యాంటీన్ ద్వారా పేదల ఆకలి నింపుతూ.. వారి కళ్లల్లో ఆనందం చూస్తున్నామని, ప్రతి మహిళకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని చెప్పారు.

**అక్కా చెల్లెళ్లకు త్వరలో 18వేలు..**

గతంలో అమ్మ ఒడిని అర్ధ ఒడిని చేసిన వైసీపీని ప్రజలు ఓడించారని, గురువారం నుంచి అమ్మకు వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే.. అంతమందికి రూ. 15 వేలు చొప్పున ఖాతాల్లో వేస్తున్నారని ఎమ్మెల్యే బోండా ఉమ పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం ఆగష్టు 15వ తేదీ నుంచి అమలు చేయనున్నామని చెప్పారు. అక్కా చెల్లెళ్లకు త్వరలో రూ. 18 వేలు కూడా అందజేస్తామన్నారు. సూపర్ సిక్స్ పథకాలను విడతల వారీగా అమల్లోకి తెచ్చామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చే సరికి ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని, చంద్రబాబు వంటి సమర్ధవంతమైన నాయకత్వంలో ప్రణాళిక బద్దంగా ముందుకు వెళుతున్నారని చెప్పారు. తొలి యేడాదిలోనే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా ముందుకు వెళుతున్నామని, వచ్చే నాలుగేళ్లల్లో కూడా ఏపీ ఆదర్శంగా నిలిచేలా అబివృద్ధి పథంలో ముందుకు సాగుతూ ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ప్రజలకు జవాబుదారీతనంతో ఉంటూ.. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కొత్తగా నేటి నుంచి వితంతు పెన్షన్లను కూడా అందజేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు మేలు జరుగుతుందని.. రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే బోండా ఉమ వ్యాఖ్యానించారు.

# ఏపీ రైతులకు కేంద్రం శుభవార్త

**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్ర రైతులకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. కందిపప్పు సేకరణ గడువును పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వెల్లడించారు. కందిపప్పు సేకరణను మరో 15 రోజులకు పొడిగింపుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలుపుతూ.. ఈ నిర్ణయంలో త్వరితగతిన సహకరించి రైతులకు ఎంతో ఉపయోగపడేలా చర్యలు తీసుకున్నందుకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు కేంద్రమంత్రి రామ్మోహన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**కేంద్రమంత్రి ట్వీట్ ఇదే..**

'ఆంధ్రప్రదేశ్ రైతులకు శుభవార్త. కందిపప్పు సేకరణ గడువుపై మన ప్రభుత్వ అభ్యర్థనను పరిశీలించి ఖరీఫ్ 2024%-%25 కాలానికి కంది పప్పు సేకరణ గడువును కేంద్రం మరో 15 రోజులు పొడిగించింది. సేకరణ పరిమితి 95,620 మెట్రిక్ టన్నులుగా జూన్ 26 వరకు రైతుల నుంచి కంది పప్పు మద్దతు ధరపై సేకరిస్తారు. ఈ నిర్ణయంలో త్వరితగతిన సహకరించి



రైతులకు ఎంతో ఉపయోగపడేలాగా చర్యలు తీసుకున్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మా ప్రత్యేక ధన్యవాదాలు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, ఎన్డీఏ ప్రభుత్వం మన రైతుల సంక్షేమం కోసం గ్రామీణ ప్రాంతా అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేస్తోంది' అంటూ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ట్వీట్ చేశారు.

# అభివృద్ధికి ప్రధాత డాక్టర్ పద్మనాభం

## - పౌర సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే, డిసిసిబి చైర్మన్‌లు




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పట్టణ అభివృద్ధి, త్రాగునీటి ఎద్దడిలో ఉన్న సామర్లకోట పట్టణానికి గోదావరి జలాలను శుద్ధి చేసి రక్షిత మంచినీటి సరఫరా పథకం ఏర్పాటుకు కృషి చేసిన డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం అభివృద్ధికి ప్రధాతగా నిలిచారని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)లు అన్నారు. స్థానిక పూర్ణా కళ్యాణ మంటపంలో 80 వసంతాలు పూర్తి చేసుకున్న మాజీ మున్సిపల్ చైర్మన్, ప్రముఖ చంటి పిల్లల వైద్యులు డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం దంపతులకు పౌర సన్మానం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాజప్ప మాట్లాడుతూ సామర్లకోట ప్రజల దాహార్తిని తీర్చి, మునిసిపాలిటీ అభివృద్ధికి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్న మునిసిపల్ చైర్మన్‌గా డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం ఎంతో ఖ్యాతి గడించారని కొనియాడారు. పట్టణంలోని చాళుక్య కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయం ధర్మకర్తల మండలి అధ్యక్షులుగా ఆలయ అభివృద్ధికి బాటలు వేశారని ఆయన తెలిపారు. అన్నదాతల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు వారి అభ్యున్నతికి అవిరళ కృషి చేశారని ఆయన వివరించారు. సభలో డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి మాట్లాడుతూ డాక్టర్ పద్మనాభం ఏ పదవి నిర్వహించినా ఆయా శాఖల అభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. ఆనంతరం డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం దంపతులకు ఎమ్మెల్యే, డిసిసిబి చైర్మన్‌ల ఆధ్వర్యంలో ఘనంగా పౌర సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మునిసిపల్ మాజీ చైర్మన్ రాజాసూరిబాబు రాజు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, పట్టణ టిడిపి అధ్యక్షుడు అడబాల కుమార స్వామి, మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్లు గుణ్ణం రాజబ్బాయి, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, గోలి వెంకట అప్పారావు చౌదరి, వైసీపీ నాయకులు దవులూరి వులూరి సుబ్బారావు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి పిట్టా జానకి రామారావు, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు సరోజ్ వాసు, మడగల శ్యాం, చీమల కొండ వీరభద్ర ప్రసాద్, గొరకపూడి చిన్నయ్య దొర, ముత్యాల వీరభద్రరావు (రాజబ్బాయి), పెంకే వెంకట లక్ష్మీ, బొందల రామలక్ష్మి, మునిసిపల్ కౌన్సిలర్ బలుసు శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, ఈత ఛాంపియన్ గోలి శ్యామల, చంద్రు గోపాలకృష్ణ, గ్రంధి రామకృష్ణ, బడుగు బాబీ, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈదల వీర వెంకట ఈశ్వర కుమార్, కంచి కామకోటి పీఠం సామర్లకోట శాఖ చైర్మన్ చంద్రాబట్ల పతంజలి శాస్త్రి, గోలి కోటేశ్వరరావు, యార్లగడ్డ వీర వెంకటరావు, నేతి వీరభద్రరావు, కర్రి ఆదినారాయణ రెడ్డి, గోలి సత్తిరాజు, నిమ్మకాయల కిరణ్ కుమార్, అందుగుల జార్జి చక్రవర్తి, డాక్టర్ యార్లగడ్డ సత్య నారాయణ, పసల పద్మరాఘవరావు, తోటకూర సాయిరామ కృష్ణ, అధిక సంఖ్యలో అభిమానులు, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్యం గాలికి...మీడియా సమావేశంలో మధు




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని కల్పించాల్సిన ప్రభుత్వం ప్రభుత్వ వైద్యాన్ని గాలికొదిలి యోగా పేరుతో సమయాన్ని వృధా చేస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు విమర్శించారు. సామర్లకోట పట్టణంలోని ఏఐసిసి కార్యాలయంలో బుధవారం సామర్లకోట పట్టణ 29వ మహా సభను నిర్వహించారు. దీనిలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మధు మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను మెరుగుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అలాగని యోగాకు ఎవరూ వ్యతిరేకం కాదన్నారు. ప్రపంచ యోగ దినోత్సవం జూన్ 22 న చేయడం తప్పులేదని కానీ ప్రధానమంత్రి మోడీ మెప్పు కోసం యోగాంధ్రా పేరుతో మే 21 నుంచి జూన్ 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా తెల్లవారుజామునే వివిధ శాఖల ఉద్యోగస్తులను, డ్వాక్రా, అంగన్వాడీ, మున్సిపాలిటీ, వివిధ విభాగాలలో పనిచేస్తున్న మహిళలను, కార్మికులను రోడ్లమీద తీసుకు రావడంతో వాళ్లందరూ తీవ్ర మనోవేదనకు గురి అవుతున్నారని మధు విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా ఆసుపత్రులలో మెడికల్ కిట్లు కూడా లేవని, మందులు కూడా లేవని విమర్శిం చారు. ఈ సమయంలో ఆస్పత్రులకు నిధులు మంజూరు చేసి ఆసుపత్రులను మెరుగుపరచాల్సింది పోయి ఇలా యోగా పేరుతో ప్రచారం చేస్తూ నిధులు దుర్వినియోగం చేయడం దారుణం అన్నారు. మరోపక్క రేపటి నుంచి విద్యాసంస్థలు ప్రారంభమవుతున్నాయని, ఇప్పటి వరకు తల్లికి వందనం వేయలేదన్నారు. అదేవిధంగా గత విద్యా సంవత్సరాలకు సంబంధించి ఫీజు రియంబర్స్మెంట్ వేయలేదని విద్యార్థులను పరీక్షలు రాసించేందుకు యాజమాన్యాలు అడ్డుకుంటున్నాయని అన్నారు. దానితో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ మహాసభలో ఇంకా పట్టణ కార్యదర్శి పెడిరెడ్ల సత్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి కె బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవరపు అప్పలరాజు, సమితి సభ్యులు పి రామకృష్ణ, సినియర్ నాయకులు కట్టా సత్యనారాయణ, మడగల రమణ, తదితరులు పాల్గొన్నారు.

# సంస్థాగత ఎన్నికలకు సిద్ధం కావాలి

## - పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు బోళ్ల వెంకట రమణ పిలుపు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సంస్థాగత ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్నందున పార్టీ నాయకులు కార్యకర్తలు ఎన్నికల నిర్మాణానికి సంసిద్ధులు కావాలని పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు బోళ్ల వెంకట రమణ పిలుపునిచ్చారు. సామర్లకోట పట్టణంలోని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దీనిలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు బోళ్ల వెంకట రమణ విచ్చేసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సంస్థాగత ఎన్నికల నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. కష్టించి పార్టీకోసం పనిచేసే నాయకులను, కార్యకర్తలకు మాత్రమే పదవులకు ఎంపికలో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం అన్ని వర్గాల వారు, సామాజిక న్యాయం, మహిళలు తప్పకుండా ఆయా కమిటీలలో సభ్యులుగా ఉండాలన్నారు. యువతకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలి అని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు అడబాల కుమార స్వామి, నూనె రామారావు, బడుగు శ్రీకాంత్, బొందల రామలక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ - స్విమ్స్ తిరుపతి వారి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి రోటరీ క్లబ్, స్విమ్స్ తిరుపతి వారి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి రోటరీ క్లబ్‌లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ ముఖ్యంగా మహిళలకు మామోగ్రామ్, పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించారు. రోటరీ క్లబ్ శ్రీకాళహస్తి, తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో బుధవారం శ్రీకాళహస్తి రోటరీ క్లబ్‌లో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. దాదాపు వంద మంది ఈ వైద్య శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా చేశారు. స్విమ్స్ డైరెక్టర్, వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ కమ్యూనిటి మెడిసిన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.హరిత, పీఆర్వో డి.చంద్ర మోహన్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ శైలజ, సెక్రటరీ సిద్ధులుగారి ప్రసాద్, క్లబ్ మెంబర్లు కండ్రిగ ఉమా, పాపగారి జనార్ధన్ వెంకట ముని పార్థసారథి, కృష్ణ కుమార్, వేణుగోపాల్, బాలాజీ, జనిత, సుబ్రహ్మణ్యం, డాక్టర్ నారాయణ, డాక్టర్ వెంకట్రామన్, అనురాధ, సుబ్రమణ్యం రెడ్డి, ప్రమీలమ్మ, కళ్యాణి, పింక్ బస్ సిబ్బంది తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# పంచారామంలో ఎన్టీఆర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పూజలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పంచారామ క్షేత్రమైన సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వర ఆలయంలో బుధవారం సాయంత్రం ఎన్టీఆర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పి చంద్రశేఖర్ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన వైస్ ఛాన్సలర్‌కు ఆలయ పండితులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం భీమేశ్వర స్వామిని, బాల త్రిపుర సుందరి అమ్మవారులను ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం నంది మండపంలో ఆలయ అధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో పండిత ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్ధప్రసాదాలను, స్వామివారి చిత్రపటం అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మరిడమ్మ అమ్మవారి హుండీల ఆదాయం రూ. 6.50 లక్షలు




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం గ్రామ దేవత అయిన మరిడమ్మ అమ్మవారి హుండీల ఆదాయం రూ. 6,50,014 వచ్చినట్టు ఆలయ కార్య నిర్వహణ అధికారిని, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయలక్ష్మి తెలిపారు. శ్రీ మరిడమ్మ అమ్మవారి ఆలయంలో 79 రోజులకు సంబంధించి వచ్చినా హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, పంచారామ క్షేత్రమైన సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వర స్వామి ఆలయ కార్యనిర్వహణ అధికారి బళ్ల నీలకంఠం, జె లోవలక్ష్మిల పర్యవేక్షణలో ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఈ సందర్భంగా సాధారణ హుండీల నుంచి రూ. 6,26,788లు, అన్నదాన హుండీ నుంచి రూ. 23,226లు వెరసి రూ. 6,50,014 లు ఆదాయం వచ్చినట్టు ఆలయ అధికారిని విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సేవలు అందించారు.

# జిల్లా స్థాయి యోగా పోటీలకు నేడు ఆఖరి రోజు : జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** జిల్లా స్థాయి యోగా పోటీలకు నేడు శుక్రవారం ఆఖరి రోజు ఆని యోగా క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగాంధ్ర 2025 కార్యక్రమం లో భాగంగా ఈ నెల 9వ తేదీ సోమవారం నుండి అనకాపల్లి పట్టణం స్థానిక గుండాల జంక్షన్ ఎస్ ఆర్ శంకరణ్ ఫంక్షన్ హాల్ వద్ద గత నాలుగు రోజులుగా జరుగుతున్నా జిల్లా స్థాయి యోగా పోటీలలో భాగంగా చివరి రోజైన నేడు శుక్రవారం ఎవరైతే 3 రకాల వయసు (10 నుండి 18 సంవత్సరాలు బాలురు మరియు బాలికలు మరియు 19 నుండి 35 సంవత్సరాల వయసు గల యోగా క్రీడాకారులు మరియు 35 సంత్సరాలు పైబడిన పురుషులు, మహిళలు) అర్హులు. ఈ వయసు గల క్రీడాకారులు ఈ దిగువ పేర్కొన్న 4 యోగా విభాగాలైన 1) గ్రూప్ పెర్ఫార్మన్స్, 2) ఆర్టిస్టిక్, 3) నాలెడ్జ్ బేసడ్ పోటీలు, 4) క్రియేటివిటి లలో జిల్లా స్థాయి యోగా పోటీల్లో పాల్గొనలేని వారు మరియు గతంలో గ్రామ, మండల స్థాయిలో యోగా పోటీలలో పోటీచేయ్యని వారు కూడ ఈ రోజు శుక్రవారం జరిగే జిల్లా స్థాయి యోగా పోటిల్లో నేరుగా యోగా క్రీడాకారులు పాల్గొని ఈ అవకాశన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆ ప్రకటనలో తెలిపారు.

# బూరుగుపూడిలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

**కోరుకొండ, (రాజధాని వార్తలు):** రాజానగరం ఎమ్మెల్యే బలరామకృష్ణ ఆదేశాల మేరకు 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బూరుగుపూడి గ్రామంలో ఉన్న హై స్కూల్, ప్రాథమిక పాఠశాల మరియు ఎంపీ హైస్కూల్ చర్చి వీధిలో గురువారం కూటమి నాయకులు ఆధ్వర్యంలో బూరుగుపూడి, కూటమి నాయకులందరూ సమక్షంలో విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు అడపా శ్రీనివాస్, టిడిపి నాయకులు కంటే నాగ కేశవరావు, కంటే గణపతి, గండి విజయ్ కుమార్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి మారుపేరు కూటమి ప్రభుత్వం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** అభివృద్ధికి మారుపేరుగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని సామర్లకోట పెద్దాపురం మండలాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవ కార్యక్రమాలను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)లు బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఎంపీడీవోలు కే హిమ మహేశ్వరి, డి శ్రీ లలితల ఆధ్వర్యంలో ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాలను చేపట్టారు. సామర్లకోట మండలంలోని పనసపాడు, పి వేమవరం గ్రామాల్లో, పెద్దాపురం మండలంలోని చదలాడ, కాండ్రకోట గ్రామాల్లోనూ పలు సిసి రోడ్లకు, సీసీ డ్రైవర్లకు ప్రారంభోత్సవ కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధి గురించి ఆలోచించని పరిస్థితులు ఉండగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలంలోనే కోట్లాది రూపాయలకు అభివృద్ధి కార్యక్రమాలు పెద్దాపురం నియోజక వర్గంలో చేపట్టినట్టు చెప్పారు. అభివృద్ధి పనులు చేపట్టే ప్రభుత్వాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. రానున్న రోజుల్లో కూడా గ్రామాల్లో ఉన్న సమస్య లను స్థానిక నాయకుల ద్వారా గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కూటమ నాయకులు, అధికారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 'రాజాసాబ్' టీజర్ అప్‌డేట్.. ఐమాక్స్‌లో ప్లాన్?



ప్రభాస్ బ్యాక్ టు బ్యాక్ సలార్, కల్కి 2898 ఏడీ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సొంతం చేసుకున్న నేపథ్యంలో ప్రస్తుతం ఆయన చేస్తున్న రాజాసాబ్ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. మారుతి దర్శకత్వంలో దాదాపు మూడు ఏళ్ల క్రితం ప్రారంభం అయిన ఈ సినిమా అనేక కారణాల వల్ల ఆలస్యం అవుతూ వచ్చింది. మారుతి దర్శకత్వంలో సినిమా ఏంటి అంటూ ప్రభాస్ ఫ్యాన్స్ మొదట తీవ్రంగా వ్యతిరేకించారు. ఇప్పుడు వారే రాజాసాబ్ సినిమా ఎప్పుడు వస్తుందా అంటూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పాన్ ఇండియా రేంజ్‌లో విడుదల కాబోతున్న ఈ హర్రర్ కామెడీ సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తి అయిందని, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది నుంచి అదుగో.. ఇదుగో అంటూ రాజాసాబ్ సినిమా విడుదలను వాయిదా వేస్తూ వస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో కచ్చితంగా సినిమాను విడుదల చేస్తాం అంటూ బలంగా ప్రచారం చేస్తూ వచ్చారు. కానీ సినిమా విడుదల తేదీ చివరి నిమిషంలో మార్చుతున్నట్లు ప్రకటించారు. అనివార్య కారణాల వల్ల సినిమాను విడుదల వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సినిమా నుంచి టీజర్ ఎప్పుడు వస్తుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గత కొన్ని వారాలుగా ఈ సినిమా టీజర్ విషయమై పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఎట్టకేలకు ఈ విషయమై మేకర్స్ నుంచి సమాచారం అందింది. జూన్ 16న రాజాసాబ్ టీజర్ విడుదల కాబోతుంది. చిత్ర నిర్మాణ సంస్థ నుంచి అందుతున్న ఆఫ్ ది రికార్డ్ సమాచారం ప్రకారం జూన్ 16న సినిమా టీజర్‌ను ఐమాక్స్‌లో స్క్రీనింగ్ చేయబోతున్నారు. ఆ తర్వాత యూట్యూబ్‌లో విడుదల చేస్తారు. టీజర్ లాంచ్ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు పలువురు పాల్గొనబోతున్నారు. ప్రభాస్ మరో సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్న కారణంగా టీజర్ లాంచ్‌కి హాజరు కాకపోవచ్చు అని తెలుస్తోంది. దర్శకుడు, నిర్మాత, సంగీత దర్శకుడు, హీరోయిన్స్‌లో ఇద్దరు కూడా ఈ టీజర్ లాంచ్ కార్యక్రమంలో పాల్గొంటారని సమాచారం అందుతోంది. ఈ విషయమై ఒకటి రెండు రోజుల్లోనే అధికారికంగా ప్రకటన వస్తుంది. ఈ సినిమాలో ప్రభాస్ కొత్త మాస్ లుక్‌ను రివీల్ చేశారు. టీజర్‌లో మరింతగా మాస్ ఎలిమెంట్స్ ఉంటాయని తెలుస్తోంది.

తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా ఉంటుందని అంటున్నారు. ఈ సినిమాను హిందీలో ప్రముఖ నిర్మాణ సంస్థ విడుదల చేయబోతుంది. హాలీవుడ్‌లో వచ్చిన సూపర్ హిట్ సినిమా హ్యారీపోర్టర్ ను తలపించే విధంగా ఈ సినిమాలోని థ్రిల్లర్ సీన్స్ ఉంటాయని బాలీవుడ్ నిర్మాత అంటున్నారు. ఇండియన్ స్క్రీన్ పై ఎప్పుడూ చూడని విధంగా ఈ సినిమాలో హర్రర్ కాన్సెప్ట్ ఉంటుందని, భయపెట్టడం మాత్రమే కాకుండా నవ్వించడం కూడా ఈ సినిమా చేస్తుంది అంటూ అభిమానులకు మేకర్స్ హామీ ఇస్తున్నారు. సోషల్ మీడియాలో రాజాసాబ్‌కి ఉన్న ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కనుక రాజాసాబ్ సినిమా విడుదల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇది ప్రభాస్‌కి మరో వెయ్యి కోట్ల సినిమాగా నిలుస్తుందని అభిమానులు నమ్మకంగా ఉన్నారు.

# ఆ ఫ్రాంచైజ్‌కు అతను కరెక్ట్ ఛాయిసేనా?



ఛావా సినిమాతో విక్కీ కౌశల్ ఎంత పెద్ద సక్సెస్ అందుకున్నాడో తెలిసిందే. ఛావా సక్సెస్ తర్వాత యష్ రాజ్ ఫిల్మ్స్ త్వరలో విక్కీ కౌశల్‌ను తమ స్పై యూనివర్స్‌లోకి తీసుకురావాలని ప్రయత్నస్తున్నట్టు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్ ఫ్రాంచైజ్‌లో రానున్న థ్రిల్లర్‌లో భాగమవడానికి విక్కీ కౌశల్ చర్చలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. ఇదే నిజమైతే విక్కీ కౌశల్ స్పై యూనివర్స్‌లో ఐదో యాక్టర్ అవుతాడు.

టైగర్‌గా సల్మాన్ ఖాన్, పఠాన్‌గా షారుఖ్, కబీర్‌గా హృతిక్ రోషన్, ఆల్ఫాగా అలియా భట్ తర్వాతి స్థానంలో ఇప్పుడు విక్కీ కౌశల్ చేరతాడు. ఇన్‌సైడ్ టాక్ ప్రకారం విక్కీ కౌశల్ ఈ ఫ్రాంచైజ్‌లో చేరడానికి ఎగ్జైటిం గ్‌గా ఉన్నాడని తెలుస్తోంది. ఇప్పటికే యాక్షన్ సినిమాల్లో తనను తాను ప్రూవ్ చేసుకున్న కౌశల్ అయితే ఈ స్పై యూనివర్స్ సినిమాకు సరిగ్గా సరిపోతాడని యష్ రాజ్ ఫిల్మ్స్ భావిస్తోంది. ఈ స్పై యూనివర్స్‌లోకి విక్కీ కౌశల్‌ను తీసుకోవడమనేది ఇంట్రెస్టింగ్‌గా ఉన్నప్పటికీ ఫ్యాన్స్ ఇప్పటికే ఆ ఫ్రాంచైజ్ మంచి సంతృప్తిని సాధించిందని భావిస్తున్నారు. మెయిన్ లీడ్‌గా నటించే వారు సిరీస్‌కు ఫ్రెష్ ఫీల్ తీసుకు రాలేకపోతే విక్కీ కూడా దాన్ని పునరుద్ధరించలేడని అంటుంటే, మరికొందరు మాత్రం రణ్‌బీర్ కపూర్ కంటే విక్కీ కౌశలే మంచి ఛాయిస్ అంటున్నారు.

ఇంకొందరు మాత్రం స్పైవర్స్ సినిమాలన్నీ ఒకేలా అనిపిస్తున్నాయని, హీరో లేదా విలన్ పాత్రలు మాత్రమే మారుతున్నాయని అంటున్నారు. కేవలం కొత్త నటుడు స్పైవర్స్ ఫ్రాంచైజ్‌ను కాపాడలేడని, మంచి రైటర్ అయితేనే ఫ్రాంచైజ్ నిలబడుతుందని కామెంట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఛావా సినిమా కూడా విక్కీ కౌశల్ యాక్టింగ్ వల్ల ఆడలేదని, అది కేవలం మతపరమైన సెంటిమెంట్, సినిమాలోని కంటెంట్ వల్లే ఆడిందని క్రిటిక్స్ కూడా చెప్తున్నారు. ఈ నేపథ్యంలో యష్ రాజ్ ఫిల్మ్స్ ఈ ఫ్రాంచైజ్ కు కొత్త నటులను తీసుకునే దానికి బదులు మంచి కథపై వర్క్ చేస్తే బావుంటుంది.

# కంగనా ఎంపీ కావడంతో కాజల్‌కి ఛాన్స్...?



సినిమా ఇండస్ట్రీలో కాజల్ అగర్వాల్ అడుగు పెట్టి రెండు దశాబ్దాలు కావస్తుంది. ఇప్పటి వరకు ఆమె ఎన్నో సూపర్ హిట్‌లను అందుకుంది. ఎంతో మంది సీనియర్, యంగ్ స్టార్ హీరోల సినిమాల్లో నటించింది. హీరోయిన్‌గా స్టార్ హీరోల సినిమాల్లో నటించిన కాజల్ అగర్వాల్ లేడీ ఓరియంటెడ్ సినిమాల్లో కూడా నటించిన విషయం తెల్సిందే. కరోనా సమయంలో పెళ్లి చేసుకుని, ఇప్పుడు తల్లిగా కూడా మారిన కాజల్ అగర్వాల్ గతంలో మాదిరిగా బిజీగా సినిమా ఆఫర్లు దక్కించుకోలేక పోతుంది. పెళ్లి తర్వాత కూడా హీరోయిన్‌గా బిజీగా ఉండాలని కోరుకున్న కాజల్ అగర్వాల్‌కి అది సాధ్యం కావడం లేదు. అరుదుగా మాత్రమే సినిమాల్లో ఆఫర్లు వస్తున్నాయి. కొన్ని సినిమాల్లో పెద్దగా ప్రాముఖ్యత లేని ఆఫర్లు వస్తున్నాయి, కొన్ని క్రేజీ సినిమాల్లో మెయిన్ లీడ్‌గా కాకుండా సపోర్టింగ్ రోల్స్‌లో నటించే అవకాశాలు వస్తున్నాయి. సాధారణంగా హీరోయిన్స్ దశాబ్ద కాలంకంటే ఎక్కువ సినిమాలు చేయడం అంటే మామూలు విషయం కాదు. కానీ కాజల్ అగర్వాల్ దాదాపుగా 15 ఏళ్ల పాటు బిజీగా సినిమాలు చేసింది. ఈ మధ్య కాలంలో ఈమె జోరు తగ్గింది. అయితే ఈమెకు ఉన్న క్రేజ్ నేపథ్యంలో పెద్ద సినిమాల్లో చిన్న పాత్రల్లో నటించే అవకాశాలు దక్కుతున్నాయి. కనుక వచ్చిన ఏ ఒక్క పాత్రను వదిలి పెట్టకుండా ప్రతి ఆఫర్‌ను సద్వినియోగం చేసుకునేందుకు గాను కాజల్ అగర్వాల్ ప్రయత్నాలు చేస్తుంది. తాజాగా కాజల్ అగర్వాల్ 'కన్నప్ప' సినిమాలో నటించింది. మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటించి నిర్మించిన ఈ భారీ బడ్జెట్ సినిమాలో కాజల్ అగర్వాల్, పార్వతిదేవి పాత్రలో నటించింది. తాజాగా కన్నప్ప సినిమా ప్రమోషన్‌లో భాగంగా పార్వతి దేవి పాత్రను మొదట కంగనా రనౌత్‌కి ఆఫర్ చేసినట్లు చెప్పుకొచ్చారు. ఆమె సరిగ్గా ఆ సమయంలోనే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన కారణంగా కన్నప్ప సినిమాకు నో చెప్పిందట. పార్వతి దేవి పాత్రకు కంగనా అయితే బాగుండు అని భావిస్తున్న సమయంలో ఆమె నో చెప్పడంతో తప్పని పరిస్థితుల్లో కాజల్ అగర్వాల్‌ను తీసుకున్నట్లు తెలుస్తోంది. కాజల్ అగర్వాల్ పాత్ర కొన్ని నిమిషాలు మాత్రమే ఉంటుంది. అయినా కూడా అత్యంత కీలకమైన పాత్రగా తెలుస్తోంది. పార్వతిదేవి పాత్రకు ఉన్న ప్రాముఖ్యత నేపథ్యంలో కాజల్ అగర్వాల్‌ను నటింపజేసినట్లు మంచు విష్ణు ఒక సందర్భంలో చెప్పుకొచ్చారు. కన్నప్ప సినిమా ప్రమోషన్‌లో భాగంగా కాజల్ అగర్వాల్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తాను భవిష్యత్తులో దర్శకత్వం చేసే ఆలోచనలో ఉన్నట్లు పేర్కొంది. అంతే కాకుండా మంచి కథలను రెడీ చేస్తున్నట్లు చెప్పింది. ప్రస్తుతం తల్లిగా లైఫ్‌ని ఎంజాయ్ చేస్తున్నట్లు పేర్కొంది. నటనపై ఆసక్తి ఉన్నప్పటికీ భవిష్యత్తులో దర్శకత్వం చేసే ఆలోచన ఉన్నట్లు పేర్కొంది. కన్నప్ప సినిమా తరహాలోనే ముఖ్యమైన పాత్రల్లో నటించే అవకాశాలు వస్తే నటించేందుకు సిద్ధం అంది. హీరోయిన్ పాత్రలు మాత్రమే చేయాలి అనే పట్టింపు కాజల్ అగర్వాల్‌లో కనిపించడం లేదు. కనుక ఆమె సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టినట్లే అని, ముందు ముందు ఆమె నుంచి మరిన్ని క్యారెక్టర్‌లు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

# అప్పుడు పారిపోయాడు.. కానీ ఫుల్ టాలెంట్ ఉంది : అల్లు అరవింద్



టాలీవుడ్ ప్రొడ్యూసర్ బన్నీ వాసు సమర్పణలో మిత్ర మండలి మూవీ రూపొందుతున్న విషయం తెలిసిందే. బీవీ వర్క్స్ బ్యానర్‌పై బన్నీ వాస్ సమర్పిస్తుండగా.. కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా.విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. సోషల్ మీడియా సంచలనం నిహారిక ఎన్.ఎం ఫిమేల్ లీడ్ రోల్‌లో కనిపించనున్నారు. కొత్త డైరెక్టర్ విజయేందర్ ఎస్ దర్శకత్వం వహిస్తున్న మిత్రమండలి టీజర్ రీసెంట్ గా రిలీజ్ అవ్వగా.. మంచి రెస్పాన్స్ వస్తోంది. అయితే టీజర్ లాంచ్ ఈవెంట్‌లో అల్లు అరవింద్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. మిత్రమండలి మూవీ టీమ్ కు ఆల్ ది బెస్ట్ చెప్పారు. టీజర్ చాలా బాగుందని.. మూవీ మంచి హిట్ అవ్వాలని కోరుకుంటున్నట్లు అల్లు అరవింద్ తెలిపారు. "బన్నీ వాసు సమర్పణలో వస్తున్న మొదటి సినిమా.. నా మిత్రులు కలిసి నిర్మిస్తున్న మిత్రమండలి టీజర్ ను రిలీజ్ చేయడం బాధ్యతగా భావిస్తున్న. నేను ఎప్పుడూ ఎక్కువగా యంగ్ స్టెర్స్ తో టైమ్ స్పెండ్ చేస్తుంటా. దాని వల్ల మూవీ స్క్రిప్ట్స్ సెలెక్షన్ సహా పలు విషయాల్లో హెల్ప్ అవుతుంటుంది. ఒకసారి బన్నీ వాసు మిత్రమండలి మూవీ కథ వినమని దర్శకుడిని నా దగ్గరకు పంపించాడు" అని తెలిపారు. "కానీ మీలాంటి పెద్ద వాళ్ల ముందు కథ చెప్పలేకపోతున్నా అని డైరెక్టర్ పారిపోయాడు. మరోసారి ప్రాక్టీస్ చేసి వస్తా అన్నాడు. అయితే కథ వినకుండానే డైరెక్ట్‌గా మిత్రమండలి చూడబోతున్నా. అయితే మీ అందరి మాటలు వింటుంటే మాత్రం డైరెక్టర్‌లో చాలా టాలెంట్ ఉందని క్లియర్‌గా అర్థమవుతుంది" అని అల్లు అరవింద్ వేదికపై వ్యాఖ్యానించారు. "అయితే నటుడు ప్రియదర్శి మాకు ఒక వెబ్ సిరీస్ చేశాడు.

అప్పుడే అతడు మంచి స్థాయికి వెళ్లాడని అనుకున్నా నేను. ఆయనకు ఒక యాక్టర్‌గా ఎంత చేయాలో.. ఎంత చేయకూడదో బాగా తెలుసు. రీసెంట్‌గా వచ్చిన కోర్ట్ మూవీలో సూపర్‌గా నటించాడు" అని కొనియాడారు. న్యాచురల్ స్టార్ నాని నిర్మించిన ఆ మూవీ సూపర్ హిట్ గా నిలిచిన విషయం తెలిసిందే. మిత్రమండలి హీరోయిన్ నిహారికకు సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉందని అల్లు అరవింద్ తెలిపారు. ఫేక్ ఐడితో ఆమె ఫాలో అవుతు న్నానని చెప్పారు. హీరోయిన్‌గా డెబ్యూ చేస్తున్న ఆమెకు బెస్ట్ విషెస్ చెప్పారు. నిర్మాతలతో తనకు ఇప్పటికే మంచి అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఆయన కామెంట్స్ వైరల్‌గా మారాయి.

# మత్స్యకారుల రక్షణకు స్ఫూర్తి ఫౌండేషన్

## - పోలాకిలో లైఫ్ జాకెట్ల పంపిణీ





**నరసన్నపేట, (రాజధాని వార్తలు):** శ్రీకాకుళం జిల్లా, పోలాకి మండలం రాజారాంపురం, గుప్పెడుపేట గ్రామంలో మత్స్యకారుల రక్షణ కోసం హైదరాబాద్‌కి చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ అండగా నిలిచింది.

వేటకు వెళ్లే మత్స్యకారుల రక్షణ కొరకు లైఫ్ జాకెట్స్ పంపిణీ కార్యక్రమం బుధవారం, గురువారం చేపట్టింది. సంస్థ డైరెక్టర్ వెంకటేశ్వరి ముఖ్యఅతిథిగా పాల్గొని, సుమారు రెండువం దల మత్స్యకారులకు జాకెట్ల పంపిణీ చేసిన అనంతరం మాట్లా డుతూ స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ శ్రీవియాల్ ఉయ్యూరు ఆలోచనల మేరకు శ్రీకాకుళం జిల్లాలో సేవలందించాలన్నారని, మత్స్యకారులు వేటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, మీ అందరి భద్రత కోసం లైఫ్ జాకెట్లను అందిస్తున్నామన్నారు. మీరు వేటకు వెళ్ళేటప్పుడు కుటుంబాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలని, క్లిష్టమైన సమయాలలో గాని, తుఫాన్ హెచ్చరిక సందర్భాలలో గాని, సమయాలోచనతో వేటకు వెళ్లరాదన్నారు. అలాగే నలుగురు విద్యార్థులను తమ సంస్థ ద్వారా గత మూడు సంవత్సరాల నుంచి ఒక ప్రైవేటు విద్యాసంస్థలో చదివించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, సాయమ్మ, శ్రీకాకుళం జిల్లా కోఆర్డినేటర్ వరప్రసాద్.పొట్నూరు, డాక్టర్ బ్రహ్మం, లుకలాపు రంజిత్ కుమార్, తంగి కృష్ణ, గ్రామాల పెద్దలు వ్యాపార ధర్మారావు, కోడ తాతారావు, మైలపిల్లి త్రినాథ్, వెంకు నాయుడు, ఉప్పాడ అప్పల రెడ్డి, కోడ లక్ష్మీపతి, నందుపిల్లి దండాసి, కూర్మారావు, మూర్తి, నారాయణరావు, రామారావు, దుమ్ము సత్యనారాయణ, కుందు సాయి, హరినాథ్, రంజిత్, జగదీష్ పాల్గొన్నారు.



# ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కంటైనర్ ఒకరు మృతి... మరొకరికి తీవ్ర గాయాలు

**విశాఖ, (రాజధాని వార్తలు):** గాజువాక తుంగ్లం రైల్వే గేట్ సమీపంలో రోడ్డు ప్రమాదం. ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కంటైనర్ గొంప గీత (27) అనే మహిళ అక్కడికక్కడే మృతి. గొంప సతీష్‌కు (30) తీవ్ర గాయాలు ఆసుపత్రికి తరలింపు.. ఇద్దరు అన్న చెల్లెలు..దర్యాప్తు చేస్తున్న దువ్వాడ పోలీసులు.

# దేశ ప్రధాని నరేంద్ర మోడీ 11 సంవత్సరాల పరిపాలన భారతదేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడింది

## - అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** దేశ ప్రధాని నరేంద్ర మోడీ 11 సంవత్సరాల పరిపాలన భారతదేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిందని అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్. ఈ రోజు పార్లమెంట్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన సీఎం రమేష్. ఈ 11 సంవత్సరాలలో అభివృద్ధి స్వలాభోనా సంకల్ప సిద్ధి యొక్క స్వర్ణ యుగంగా మార్చారు. 11 సంవత్సరాల ప్రయాణం ప్రధానమంత్రి మోడీ ఒంటరిగా 140 కోట్ల మంది భారతీయుల కృషి త్యాగాల మరియు కలను అంకితం చేసుకోవడం ద్వారా జరిగింది. మోడీ పాలనలో పేదలకు సంక్షేమం సూపర్ పాలన అందించడంలో సిద్ధస్థుడు. మోడీ నాయకత్వంలో ప్రభుత్వం ఇలా మారింది ప్రతి స్పందనాత్మక బాధ్యత వితమైన జవాబుదారితనం సంస్కరణ పనితీరు పరివర్తన. 2014 ముందు భారతదేశం అవినీతికి మోసాలకి బుజ్జగింపుల రాజకీయాలకు బాధ పడిందని ఇప్పుడు అభివృద్ధి ఆవిష్కరణ పరివర్తన. రక్షణ ఎగుమతులు భారతదేశము స్వలాభవన పొందుతున్న 30 రెట్లు పెరిగాయి. అవినీతి కుంభకోణాలపై సమయం ముగిసింది పారదర్శకతను నిర్ధారించింది. గతంలో ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రజలకు చేరలేదు మధ్యవర్తులు నిధులను మింగేసారు నేడు ప్రత్యక్ష ప్రయోజన బదిలీలు నిధులను నేరుగా పౌరుల ఖాతాల్లోకి జమ చేస్తున్నారని అన్నారు. ఇంతకు ముందు మనం దిగుమతులపై ఆధారపడి ఉన్నాము నేడు మేక్ ఇన్ ఇండియా కారణంగా మనం ఎగుమతులలో ముందున్నామని గతంలో మనం ప్రపంచంలోని పెలుసైన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఉన్నాము నేడు భారతదేశ నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే మార్గంలో ఉంది ప్రధాని మోడీ నాయకత్వంలో భారతదేశం ఇప్పుడు సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోగలరు మరియు ఉగ్రవాదానికి నిర్ణయాత్మక సైనిక ప్రతి స్పందనలతో సహా కొత్త సాధారణలను నిర్వహించగలదు ఆపరేషన్ సింధూర్ విజయాన్ని ప్రపంచం గుర్తించిన సమయంలో అమృత్ కాల్ 11 సంవత్సరాల జరుపుకోవడం యాదృచ్ఛికం కాదు అని అన్నారు ఆపరేషన్ సింధూర్ కేవలం సైనిక లక్ష్యం కాదు ఇది మన సంకల్పం ధైర్యం మరియు మారుతున్న భారతదేశం యొక్క ప్రతిరూపాన్ని చూపించడం రక్షణ రంగంలో భారతదేశం స్వలంబన చెందుతోంది ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా భారతదేశంలో తయారు చేయబడింది పాకిస్థాన్లో పరిరక్షించబడింది ప్రపంచ వ్యాప్తంగా విశ్వసనీయమైనది అని గుర్తించబడిన తెలిపారు. గత ప్రభుత్వంలో ఇందిరా నుంచి మన్మోహన్ వరకు కాంగ్రెస్ పాలనలో పేదరికాన్ని నిర్మూలించండి వంటి నినాదాలు మాత్రమే ఇవ్వబడ్డాయి కానీ నేడు మోడీ ప్రభుత్వం హయాంలో 270 మిలియన్లకు పైగా ప్రజలు పేదరికం నుండి బయటపడినట్లు తెలుస్తోంది మోడీజీ ప్రధాని అయినప్పటి నుండి అవినీతి చీకటి మసక బారిందని మరియు సుపరిపాలన యొక్క వెలుగు వ్యాపించిందని కొనియాడారు.

# మధ్యాహ్నం భోజన పథకంలో భాగంగా స్కూల్స్, కాలేజిల్లో, సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం ప్రారంభం : జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకంలో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా గురువారం నుండి అన్ని ప్రభుత్వ స్కూల్స్, కాలేజిల్లో ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు మరియు ఎస్సీ, ఎస్టీ, బిసి, సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులకు మరింత నాణ్యతగా భోజనం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గురువారం జిల్లాలో అన్ని పాఠశాలలకు మరియు సంక్షేమ హాస్టళ్లకు గాను అవసరమైన సన్న బియ్యం పౌర సరఫరాల సంస్థకు సంబంధించిన 15 మండల స్థాయి గోదాముల నుండి ఈ నెల 12 గురువారం న జిల్లా వ్యాప్తంగా 1418 ప్రభుత్వ పాఠశాలలు, 136 ఎస్సీ, ఎస్టీ, బిసి, సంక్షేమ హాస్టల్స్ కు 16,898 ప్యాకేట్లు నాణ్యమైన సన్న బియ్యం 25 కేజీల సంచుల్లో పంపిణి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. దీని నిమిత్తం ప్రతి బస్తాకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి సన్న బియ్యానికి సంబందించిన సమాచారం మొత్తం రైతు వివరాము నుండి టెక్నికల్ అసిస్టెంట్ సంబందించిన వివరాలు పొందుపరచడం జరిగిందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆ ప్రకటనలో తెలిపారు.

# ఏడాది పాలనలోనే 70శాతం హామీలను నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వందే

**- కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో రాష్ట్రం సమాగ్రాభివృద్ధి సాధించింది - అనకాపల్లి పట్టణం, టీడీపీ కార్యాలయంలో ఘనంగా కూటమి ప్రభుత్వ వన్ ఇయర్ వేడుకలు - ఏడాదిలోనే ఉత్తరాంధ్రకు లక్ష కోట్ల పెట్టుబడుల ఘనత కూటమి ప్రభుత్వందే - నరేంద్ర మోడీ చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు త్రిమూర్తులాగా రాష్ట్రాన్ని అభివృద్ధి పరుస్తున్నారు - టీడీపీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ & ఇన్ఫ్రాస్ట్రాక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి పీలా గోవింద సత్యనారాయణ**





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ఈ రోజు అనకాపల్లి పట్టణం, గవర పాలెంలోని స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన కూటమి ప్రభుత్వం ఏడాది సూపరిపాలన సందర్భంగా టీడీపీ శ్రేణులు మధ్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో భాగంగా ఆయన పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు.

అనంతరం టీడీపీ శ్రేణులకు స్వీట్స్‌ను తినిపించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

# అచ్యుతాపురం పారిశ్రామికవాడలో 10 వేల మంది కార్మికులతో భారీ యోగా ప్రదర్శన కార్యక్రమంలో హాజరైన అనకాపల్లి ఎం.పీ

**- యోగా అనేది ప్రాచీన భారతీయ సంపద - యావత్ ప్రపంచం భారతదేశం వైపు చూస్తుంది - 21న విశాఖపట్నంలో మోడీ పాల్గొననున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకను విజయవంతం చేయండని పిలుపునిచ్చిన రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్**



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** యోగాంధ్ర-2025 కార్యక్రమంలో థీమటిక్ యోగ ప్రదర్శనలో భాగంగా అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలం (ఎస్ ఈ జెడ్ ) ఏ పీ ఐ ఐ సీ వన్ స్టాప్ సెంటర్ వద్ద జిల్లా పారిశ్రామిక శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఆయుష్ శాఖ సహకారంతో గురువారం ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు పదివేల మంది పారిశ్రామిక వాడ కార్మికులతో యోగా ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగ గురువులు ఆర్.శ్రీను, బి.అప్పారావు, ఈ కార్యక్రమాన్ని నడిపిస్తూ యోగాలోని ఆసనాలు బ్రీతింగ్ టెక్నిక్స్ అన్నీ కూడా చేసి చూపించి హెూం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి లోక్‌సభ ఎంపీ సిఎం రమేష్, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, యలమంచిలి, వి మాడుగుల శాసనసభ్యులు సుందరాపు విజయ్ కుమార్, బండారు సత్యన్నారాయణ మూర్తి మరియు కార్మికులతో చేయించడం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎం.పీ సి.ఎం రమేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకునే అంతర్జాతీయ యోగా దినోత్సవం మన ఆరోగ్యానికి, మానసిక శాంతికి యోగాసనాల ప్రాముఖ్యతను గుర్తు చేస్తుంది అని పేర్కొన్నారు. యోగా అనేది ప్రాచీన భారతీయ సంపదగా, మన శరీరం, మనస్సు, ఆత్మ సమతుల్యతను తీసుకొచ్చే మార్గం అని అన్నారు. కార్మికులు ఆరోగ్యంగా ఉండటానికి యోగా ఎంతగానో దోహదపడుతుంది అని తెలియజేసారు. ఈ నెల 21న విశాఖపట్నంలో గౌరవ ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొననున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను అందరూ కలసి విజయవంతం చేయండి అని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే మా ధ్యేయం

## - కేజీహెచ్ నూతన సూపరింటెండెంట్ డాక్టర్ ఇసుకపల్లి వాణి



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ఉత్తరాంధ్రాకి అతి పెద్ద ఆసుపత్రి కేజీహెచ్ నూతన సూపర్డెంట్‌గా డాక్టర్ ఇసుకపల్లి వాణి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా 85 వార్డ్ ఇంచార్జ్ కార్పొరేటర్ ఇల్లపు ప్రసాదు ఏడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, వార్డు టిడిపి నాయకులు బండారు చందు రమేష్ ,విందుల నాగేంద్ర, కొల్లిమల్ల గురుమూర్తి పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. డాక్టర్ ఇసుకపల్లి వాణి మాట్లాడుతూ తాను చదువుకున్న కాలేజీలో ఆచార్యులుగా విభాగాతిపతిగా చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని, ఇప్పుడు కీలకమైన సూపర్డెంట్ పదవితో ఎంతో నమ్మకంగా ఇచ్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఈ బాధ్యత ఎంతో నీతి నిబద్ధతతో పనిచేసే రోగులకు మెరుగైన వైద్యం అందజేయడం కేజీహెచ్ ఖ్యాతిని ఇనుమడింప చేయడం తన కర్తవ్యం అని దానిని కచ్చితంగా అమలు చేయడానికి కృషి చేస్తానని ఆశాభావం వ్యక్తపరిచేశారు వ్యక్తం చేశారు. ఇప్పటికే విశాఖ స్టీల్ ప్లాంట్ మరికొన్ని పరిశ్రమలు కేజీహెచ్ అభివృద్ధికి సిఎస్ఆర్ ఫండ్స్ ఇవ్వడం జరిగిందని ఇంకా అభివృద్ధి చెందడానికి ఫార్మాసిటీ పలు పరిశ్రమలు సిఎస్ఆర్ నిధులు కేజీహెచ్ అభివృద్ధికి ఇచ్చి సహకరించాలని అన్నారు. ఇల్లపు ప్రసాద్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజలకు కేజీహెచ్ దేవాలయంలాంటిదని ఎంతో నమ్మకంతో పేద ప్రధానకం ఇచ్చుటికి వస్తారని నైపుణ్యం గల డాక్టర్లు ఎంతోమంది ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారని అగనంపూడి ఏరియా ఆసుపత్రి మరియు సిహెచ్ ఆసుపత్రిలో నుండి గర్భిణీలు క్షేత్రగాత్రులు వస్తున్నారని కేజీహెచ్‌కి పంపిస్తున్నారని ముఖ్యంగా అటువంటి వారికి వైద్య సలహాలు ఇవ్వాలని కోరారు. కేజీల అభివృద్ధికి మా తరపున సంపూర్ణ సహకారం ఉంటుందని అన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan